
# ద్వాపరయుగపు గార్దభమే...!

హైమాభార్గవ్



అర్ధరాత్రి.

కంసుడిపురంలోనూ, అంతఃపురంలోనూ కట్టుదిట్టమైన కాపలా విధించబడి ఉంది. తెలుగు సినిమాల్లోనూ, తెలుగు టీ.వీ.లోనూ చూపించినంత భయంకరంగా లేకపోయినా, రాత్రి నిశ్శబ్దంగా, గంభీరంగా ఉంది. సినీ జనాలు టేప్ చేసి వినిపించే నక్క ఊళలు, తీతువు పిట్టల తియ్యటి పాటలు, గుడ్లగూబల వాద్య గోష్ఠి మొదలైనవి వినబడటం లేదు.

అష్టమినాటి ఆ అర్ధరాత్రి కష్టపడి ప్రసవించిన దేవకి నీరసంతో సొమ్మసిల్లింది. పుట్టిన పసికందు అందరిలా కెవ్వుమని అరవలేదు. ఏడుస్తూ పుడితే జీవితమంతా ఏడుపే అని గ్రహించిన ఘటికుడు కనుక అందంగా, ఆనందంగా నవ్వుకుంటూ అమ్మా, నాన్నా ఏం చేస్తున్నారా అని క్రీగంట చూశాడు. బుజ్జిగాడి సైడ్ గ్లాన్స్ ఎవరూ చూడలేదు. అర్ధాంగి అవస్థలో భాగం పంచుకుంటూ ఆవిడకు సహాయం చేస్తున్న తండ్రి చిన్నవాడి కళ్లకు కనబడే నాన్న మగ ఈగో లేనివాడని సంతోషపడ్డాడు.

'పురిటి కందు ఎందుకు ఏడవలేదా' అని కంగారుపడుతున్న దేవకి ఆకాశవాణి హెచ్చరికను గుర్తుకు తెచ్చుకుంది. బిడ్డను దగ్గరకు తీసుకుని హత్తుకుంది.

"ఏడవకు చిట్టి తండ్రీ! నువ్వు పుట్టావని తెలిస్తే నిన్ను బతకనివ్వరు. నువ్వు నరుడివో, నారాయణుడివో నాకు తెలియదు. నేను మాత్రం అసాధారణమైన గర్భశోకాన్ని అనుభవిస్తున్న సామాన్య మానవురాలిని." - స్వగతంలో మాట్లాడుకుంటూ కన్నీరు కార్చింది దేవకి.

కన్నీటి వెనుక ఉన్న కన్న తల్లి హృదయాన్ని అర్థం చేసుకున్నాడు కన్నయ్య. "ఇంకా నేను నరుడినో, నారాయణుడినో అనే డైలమాలోనే వీళ్లున్నారు. ఈ జన్మంతా నేను దేవుడి నని అస్తమానం చెప్పుకోందే, లీలలు ప్రదర్శించందే వీళ్లెవరూ నన్ను నమ్మేటట్లు లేరు. అవతారాలెత్తడంలో వెరైటీ ఉన్నా మనుమల అజ్ఞానాన్ని భరిస్తూ బతకడం కంటే రోత ఇంకోటి లేదు. కానీ స్థితి కారకుడైన తను మేనేజింగ్ డైరెక్టర్‌లాంటివాడు. అవస్థలూ, ఆనందాలూ అన్నీ అనుభవిస్తూ, ప్రపంచమనే కంపెనీని, బేలెన్స్‌లో పెట్టక తప్పదు. తనకు ఆలోచించే; వ్యవధి అంతగా ఉండదు. ఒక మంచి ఎగ్జిక్యూటివ్ లక్షణం ఏమిటంటే సత్వర నిర్ణయాలు తీసుకోవడమే" - అనుకుంటూ ఆలోచన నుండి ఆచరణకు సిద్ధమయ్యాడు వాసుదేవుడు. ఉన్నట్లుండి కనబడితే ఉలిక్కిపడతారేమో అనుకుని, "అమ్మా!" అని పిలిచాడు.

పసికందు పలకరిస్తున్నందుకు దేవకి ఆశ్చర్యపోయింది. చెరసాలలోని దీపాలు ఆరిపోయాయి. మణిరత్నం సినిమాలోని ఫొటోగ్రఫీలా వెలుతురు పసివాడి వెనుక నుండి ఫోకస్ చేయబడింది. చిన్నప్పటి ఎన్టీ రామారావులా మనోహరంగా నవ్వుతూ కనబడ్డాడు మధుసూదనుడు. లక్ష్మిని పుట్టింట్లో వదిలేసి ఒంటరిగా వచ్చాడు. దేవకి అంజలీదేవిలా ఆనంద బాష్పాలు కార్చుతూ, సతీ సక్కుబాయిలా పాండురంగడి పాదాలు పట్టుకుంది. వసుదేవుడు గుమ్మడిలా డిగ్నిఫైడ్‌గా, ఆనందంతో "మాధవా!" అన్నాడు గాద్గదిక స్వరంతో.

కృష్ణయ్య అమ్మాయి లందరూ మూర్ఛిల్లేంత అందంగా నవ్వాడు.


'వన్స్ మోర్! మళ్లీ మళ్లీ నవ్వు తండ్రీ! ఇంత అందమైన నవ్వును ఇంకెప్పుడు చూస్తానో అనుకుంటూ తెలుగు టీ.వీ. అనౌన్సర్ నవ్వు చూసి, పిచ్చెక్కి జుట్టు పీక్కున్న తెలుగు ప్రేక్షకుడు 'మొఘల్ ఎ ఆజమ్'లో మధుబాల నవ్వును చూసి సేద దీరి, మత్తిల్లినట్లు, మాధవుడి వైపే చూస్తూ మురిసిపోయాడు వసుదేవుడు.

'లాభం లేదు. వీళ్లు రఫీ పాటలు వింటున్నట్లు పరవశించిపోతున్నారు. కాస్త అలర్ట్ చేయాలి. లేకపోతే మేనమామ వస్తాడు' అనుకున్న మహావిష్ణువు ఘంటసాల కంఠంతో మాట్లాడసాగాడు. సాక్షాత్తు వైకుంఠవాసుడే తమ కొడుకుగా జన్మించాడని తెలిసి సంతోషపడుతున్న ఆ తల్లిదండ్రులు తమ బిడ్డ ముద్దు ముచ్చట్లు చూసుకునే అదృష్టం లేనందుకు దుఃఖిస్తూ, తమ వంశాంకురాన్ని సురక్షిత స్థానానికి తరలించేందుకు నిర్ణయించుకున్నారు. గుండెను బండరాయిగా మార్చుకున్నారు.

వసుదేవుడు బిడ్డను బుట్టలో ఉంచి, బుట్టను తల మీద పెట్టుకున్నాడు. **తమ బిడ్డను వేరొకరి సంరక్షణలో వదిలే ఆడపిల్లల తల్లిదండ్రులు, కన్యాదానానికి ఆడపిల్లను బుట్టలో తీసుకురావాలన్న సంప్రదాయానికి బహుశ అప్పుడే అంకురార్పణ జరిగి ఉండొచ్చు.**

సినిమాల్లో విలన్ డెన్‌లో విలన్ బటన్ నొక్కగానే తలుపులు ఆటోమేటిగ్గా తెరుచుకున్నట్లు విష్ణు మాయ వల్ల చెరసాల తలుపులు తెరుచుకున్నాయి. కాపలావాళ్లు క్లోరోఫారం పీల్చినట్లు నేలకొరిగారు. వడివడిగా నడుస్తున్న వసుదేవుడు రాజుగారి చాకలి ఇంటిని దాటబోతుంటే ఏదో అలికిడి అయింది. కంగారుతో తలతిప్పి చూసిన వసుదేవుడికి ఓండ్ర పెట్టడానికి ప్రయత్నిస్తున్న గాడిద కనబడింది. అతని గుండె వేగంగా కొట్టుకుంది. 'ఈ గాడిద అరిస్తే ఇంకేమైనా ఉందా? రక్షక భటులు నిద్రనుండి మేలుకోరూ?'

ఏమీ తోచని వసుదేవుడు గబగబా వచ్చి బుట్ట పక్కన పెట్టి, గాడిద కాళ్లు పట్టుకున్నాడు. "ఓసీ గార్దభమా! అరవకే. సాక్షాత్తు ఆ దేవుడే బిడ్డగా పుట్టాడు. నువ్వు అరిస్తే కావలావాళ్లు వచ్చి బిడ్డను తీసుకెళ్తారు. కంసుడు నా బిడ్డను చంపేస్తాడు" అన్నాడు.



**వసుదేవుడు** గాడిద కాళ్లు పట్టుకోవడం చూసిన చిన్నికృష్ణుడికి బాధ కలిగింది. "ఏం చేద్దాం? బిడ్డలను కన్న నేరానికి వాళ్ల క్షేమం కోసమో, ఉద్యోగాల కోసమో కన్నతండ్రులు అడ్డమైన వాళ్ల కాళ్లూ పట్టుకోవడం ఈ యుగం నుండే మొదలైంది" అనుకుంటూ నిట్టూర్చాడు. ఓసారి గాడిద వైపు చూసి, దానికి మనిషి భాషలో మాట్లాడే వీలు కల్పించాడు. లేకపోతే తండ్రి బాధ అర్థం కాక అది అరిచి గొడవ చెయ్యొచ్చు.

"కాసేపు దేవుడంటావు. కాసేపు నా బిడ్డంటావు ఏమి టిదంతా? నిజంగా దేవుడే పుడితే నువ్వెందుకు భయపడటం? అయినా ఈ బుట్టలో ఉన్న బుడత దేవుడే అనే గ్యారంటీ ఏమిటి?" అంది గాడిద.

'ఇది వచ్చే జన్మలో క్రిమినల్ లాయర్ కావడం తథ్యం!' అనుకున్నాడు అండపిండ బ్రహ్మాండాలను తనలో దాచుకుని, తను మాత్రం బుట్టలో దాగున్నవాడు.

"నీ కీ అవతారాల మహాత్మ్యం, దేవుడి లీలలు అర్థం కావు. నేను వెళ్లొచ్చేవరకూ అరవకు!" అంటూ బతిమాలుకున్నాడు వసుదేవుడు.

"నోరు మూసుకుంటే నా కేం లాభం?" అంది గాడిద - మంత్రివర్గంలో తనకు పదవి లేకపోతే తనూ, తన బలగం విడిపోతామని ముఖ్యమంత్రిని బెదిరించిన రాజకీయ పండిట్‌లాగా.

"నీ బ్లాక్ మెయిలింగ్ పాడుగానూ!" విసుక్కుని కళ్లు మూసుకున్నాడు బుట్టలో బుజ్జాయి.

"విశ్వ శ్రేయస్సు నీ శ్రేయస్సు కాదా? కంసుడి వధ లోకకళ్యాణం కాదా?" అన్నాడు వసుదేవుడు.

"లోక కళ్యాణం వల్ల నా కేం లాభం? ఈ

చాకలివాడు బడితెతో నాకు రోజూ పెళ్లి చేస్తూంటాడు. ఈ చాకిరీ, ఈ దెబ్బలూ - ఇవి మాత్రం నాకు తప్పవు కదా!'' వినుగ్గా అంది గాడిద.

"అదా నీ బాధ! భయపడకు! నాకు సహాయం చేస్తే ఆ దేవుడు నీకు మోక్షం ఇస్తాడు.''

"మోక్షం ఎవడి క్కావాలి?' అన్న గాడిద ప్రశ్నకు ఇటు వసుదేవుడూ, అటు వాసుదేవుడూ ఒక్కసారే ఉలిక్కిపడ్డారు.

"మోక్షం వద్దా! ను వ్వేమంటున్నావో నీకు తెలుసా? మహామహా ఋమలే మోక్షం కావాలంటూ తపస్సు చేస్తారు. నీకు తేరగా వస్తుంటే విలువ తెలియడంలేదు.'' కినుకగా అన్నాడు వసుదేవుడు.

"మోక్షం అంటే నాకు వినుగు. ఏ ఆలోచనా, ఏ అనుభూతీ ఏమీ లేకుండా ఎలా ఉంటారు? అందులో మజా ఏముంది?'' పెదవి విరిచింది గాడిద.

"నువ్వు గాడిదవు. అందుకే ఏమీ తెలియదు. నీలాంటిదాన్ని చూసే - గాడిద కేమి తెలుసు గంధప్పొడి వాసన అన్నారు'' - కోపంగా అన్నాడు వసుదేవుడు.

"గాడిద, గాడిద అంటూ అవమానిస్తున్నారు. ఒకపక్క ఇలా అంటూనే నా కాళ్లు పట్టుకుంటున్నారు. ఇలా అయితే నేను అరుస్తాను!'' కోపంగా అంది గాడిద.

ఇక లాభంలేదని జోక్యం చేసుకున్నాడు



పద్మావతి (మద్రాస్)

శ్రీమహావిష్ణువు.

"సరే. నువ్వు గాడిదవి కావు. నీ కేం కావాలో త్వరగా చెప్పేయ్!'' అంటున్న పురిటికందువైపు ఆశ్చర్యంగా చూసింది గాడిద.

దానికి భయం వేసింది. తను ఎక్కడా ఈ వింత చూడలేదు. తను మనిషిలాగా మాట్లాడగలగటం, ఈ చిన్న కూన మాట్లాడటం ఇవన్నీ వింతగానే ఉన్నాయి. ఇంతకూ ఈ పిల్లవా డెవరు? దేవుడో, దయ్యమో తెలియని సందిగ్ధంలో అసంకల్పితంగా నమస్కరించింది.

"చిరంజీవ!'' అంటూ దీవించి, "నన్ను గుర్తుపట్టావా?'' అని అడిగిన దేవుడితో "గుర్తు లే''దని చెప్పింది గాడిద.

ఒక్క క్షణంలో దానికి పూర్వజన్మ జ్ఞానం కలిగించాడు దేవుడు.

గాడిదకు గత జన్మంత ఫ్లాష్‌బ్యాక్‌లా గుర్తొచ్చింది. త్రేతాయుగంలోని తన జ్ఞాపకాలు మనసులో మెదిలాయి. అప్పుడు కూడా తను గాడిదగా ఒక చాకలివాడి ఇంట్లో ఉండేది. యజమాని మాటలు బుద్ధిగా వినే తను ఒకే ఒక్కసారి మొండికేసింది. ఆ చాకలివాడు పిచ్చిపిచ్చిగా వాగి సీతమ్మ మీద నింద వేశాడు. ఆ విషయం తెలిసిన రామయ్య సీతమ్మను అడవిలో వదిలిపెట్టాడు. సీతమ్మ పరిస్థితికి తనకు ఏడుపొచ్చింది. ఈ చాకలివాడి మూలంగానే కదా ఇదంతా జరిగిం దనే కోపంతో వాడు తన దగ్గరకు రాగానే వెన క్కాళ్లతో ఎగిసి తన్నింది. వీపు మీద బట్టల మూట ఉంచితే తను కింద పడేసింది. వాడు కోపంతో తనను కొట్టాడు. ఆరోజు నుండి తను చాకలివాడి మాట వినలేదు. వాడు కోపంతో తనకు గడ్డి వేయటం మానేశాడు. తన క్కూడా కోపం, పంతం వచ్చాయి. 'గడ్డి తినే వెధవ వేసే గడ్డిని త నెందుకు తినడం' అని తను నిరాహార దీక్ష చేసింది. అందువల్ల తను మరణించింది. గత జన్మ గుర్తొచ్చిన గాడిదకు కళ్లు చెమరించాయి.

"ను వ్వెవరయ్యా?'' అంది దేవుడితో.

"ఆ రాముడినే ఈ జన్మలో కృష్ణుడుగా అవతారం ఎత్తాను.''

గాడిద సంతోషంతో ఓండ్ర పెట్టబోయింది.





# రైతు సోదరులకు దీపావళి శుభాకాంక్షలతో!

రొయ్యల మేతలతో నూతన అధ్యాయాన్ని సృష్టించిన బాలాజీ [Balaji] వారి నేతృత్వంలో మరో రొయ్యల మేత తయారీ సంస్థ ఏంజిల్ [Angel] వారి ఉత్పాదన అతి త్వరలో మీ ముందుకు వస్తుంది.




**BALAJI ACQUA & AGRO PRODUCTS [P] Ltd.,**

**ANGEL PHARMA PVT. Ltd.,**
**6-204-2, Kamayyathopu Centre,**
**Kanuru Road,**
**VIJAYAWADA - 520 007**

PHONES: Office - 58324, 58426, 58427. Resi - 471096
Factory - 59576, 572391. Fax : 0862-471170

'ష్! అరవకు!' అన్న కృష్ణుడి సైగ విని ఎలాగో నిగ్రహించుకుంది.

"చూశావా, ను వ్వెంత మంచిదానివో! ఆ రోజు నువ్వు సీతమ్మ కోసం ఏడ్చావు. నా కా విషయం తెలుసు. నువ్వు నన్నే స్మరిస్తూ మరణించావు. అందుకే ఈ జన్మలో నీకు కనబడ్డాను. నీ కేం వరం కావాలో కోరుకో!"


భక్తిపారవశ్యంతో ఉన్న గాడిద కాసేపు ఇహ లోకాన్ని మరిచిపోవడంతో వరాలకు ప్రాధాన్యం ఇవ్వలేదు.

"నా కెందుకయ్యా వరాలు? ఈ జన్మలో నువ్వు ఆలిని అడవికి పంపించకు. అంతేచాలు!" అంది.

**కృష్ణుడు** నవ్వుకున్నాడు.

దేవుడి నవ్వును గమనించిన గాడిద మరోలా అర్థం చేసుకుంది.

"ను వ్వెందుకయ్యా సీతమ్మను అడవికి




పంపించింది? నీకు తెలియదా సీతమ్మ శీలం గురించి?"

"నేను పోయిన జన్మలో పర్ఫెక్షనిస్టును. అందువల్లే అన్ని కష్టాలు పడ్డాను. లోకం చాలా విచిత్రమైంది. నల్ల కాగితంలో ఒక తెల్ల చుక్క ఉంటే దాన్ని ఎవరూ పట్టించుకోనట్లు దుర్మార్గుడిలో ఒక్క సుగుణం ఉంటే అది ఎవరి కళ్లకూ ఆనదు. అదే తెల్ల కాగితంలో నల్ల మచ్చ ఉంటే అది అందరికీ కనబడుతుంది. మంచివాడి బతు కంతే!

"అతను ఎంత మంచిగా బతికా డనేది లోకం పట్టించుకోదు. చేసిన పొరపాటునే అందరూ పట్టించుకుంటారు. రామరాజ్యం అంటే అది నా రాజ్యం అని నే ననుకోలేదు. గవర్నమెంట్ ఆఫ్ ద పీపుల్, బై ద పీపుల్, ఫర్ ద పీపుల్ అనుకున్నాను. అగ్రజాతులుగా ముద్రపడ్డవాళ్లు నీతులు, నియమాలు అనే కత్తుల బోనులో ఉండేవాళ్లు. వాళ్లు చిన్న తప్పు చేసినా ప్రాయశ్చిత్తం చేసుకునే వరకూ ఎవరూ వదిలేవాళ్లు కాదు. కానీ ఈ నీతులూ, ఆంక్షలూ అంతగా పాటించే అవసరం లేని రజకుడే సీతమ్మ శీలాన్ని శంకిస్తే, తక్కిన వర్గాల్లోని ప్రజలు ఇంతకంటే ఘోరంగా అనుకుంటారేమో నని దిగులు పడ్డాను. తమను పాలించేవాడి కుటుంబ చరిత్ర మచ్చలేనిదిగా ఉండాలని ప్రజలు కోరుకుంటారు. అందుకే గుండె రాయిగా చేసుకుని నా దేవతను అడవిలో వదిలిపెట్టాను.

"నా పరిస్థితి నీకు అర్థం కాదు. సీతమ్మను వదలకపోతే 'స్త్రీ వ్యామోహం' అని ఒక వర్గం తిడుతుంది. వదిలిపెడితే దుర్మార్గుడి నని ఇంకో వర్గం తిడుతుంది. ఎటుతిరిగి తిట్టించుకునేటప్పుడు స్వార్థపరు డనే మాటకంటే, జాలి లేనివా డనిపించుకోవడమే మంచి దనుకున్నాను. అందరినీ అన్నివేళలా సంతృప్తిపరచడం సాధ్యం కాదని తెలిసి, నాకు చేతనైంది చేశాను."

"నువ్వు ఎన్నైనా చెప్పు, నువ్వు చేసింది నాకు నచ్చలేదయ్యా!"

"నా క్కూడా నచ్చలేదు. ఆ యుగంలో అలా ప్రవర్తించాల్సి వచ్చింది."

"ఈ యుగంలో అమ్మను వదిలిపెడతావా తండ్రీ?" దిగులుగా అడిగింది గాడిద.

"ఆ పొరపాటు ఇం కెప్పుడూ చెయ్యను. ఆ జన్మలో నా లక్ష్మికి దూరమై నరకయాతన పడ్డాను. ఇప్పు డలా జరగదు. లోకం కోసమే కాదు. నా కోసం కూడా నేను బతుకుతాను. నరుడికయినా, నారాయణుడికైనా అనుభవాల బట్టి ఆదర్శాలకు అమెండ్‌మెంట్లు చేసుకోవలసి వస్తుంది. నా లక్ష్మిలోని కళలను ఎనిమిది మందిలో నిక్షిప్తం చేసి, అష్ట లక్ష్ములనూ పెళ్లాడతాను.నేను ఆ జన్మలో పోగొట్టుకున్న ఆనందానికి ఎనిమిది రెట్ల ఆనందాన్ని ఈ జన్మలో పొందుతాను."

"అయితే త్రేతాయుగంలోలా ఒకటే మాట, ఒకటే మగువ అనే పద్ధతి ఈ యుగంలో లేదా తండ్రీ?" గాడిద అమాయకంగా అడిగింది.

"చాలా వెర్రిదానివి. ఆ యుగంలో ఉన్నట్లు ఇప్పుడుంటే ఈ కాలం వాళ్లు నా చెవులకు తాటాకులు కడతారు. ఇప్పుడు ప్రజలు మారిపోయారు. మారే కాలంతో నేను కూడా మారాలి. వీళ్లకంటే తెలివిగా ఉండాలి. ఈ జంబూద్వీపంలోని హస్తినాపురం గతి ఎప్పటికీ ఒక్కలాగే ఉంటుంది. పదవి కోసం కొట్టుకోవడం, సింహాసనం పోకుండా ఉండేందుకు ఎత్తుకు పై ఎత్తులు వేయడం ఈ యుగంతోనే మొదలై కలియుగాంతం వరకు ఇలాగే కొనసాగుతాయి. ఈ యుగంలో చాలా పెద్ద యుద్ధం జరిగి కోట్ల మంది చనిపోయే రోజు వస్తుంది.

"అలాంటప్పుడు ఏకపత్నీవ్రతం పాటిస్తే జనాభా బాగా తక్కువైపోతుంది. అది చాలా ప్రమాదం. అందుకే ఇప్పుడు భార్యలు, వాళ్లకు పుట్టే సంతానం కూడా ఎక్కువగా ఉంటారు. వీళ్లందరూ యుద్ధానికి సరిపడే యోధులను సరఫరా చేస్తారు. ఎందరో చనిపోయినా వాళ్ల సంతతి బతికి జనాభా తగ్గకుండా కాపాడుతారు. ఇలా జనం పెరిగి, వచ్చే యుగానికి ఈ దేశంలో జనాభా ఒక సమస్యగా అవుతుంది. అప్పుడు మళ్లీ మరో అవతారం. మరో యుద్ధం. బ్యాలెన్సింగ్ బీమ్ మీద జిమ్నాస్టిస్ట్ విన్యాసాల్లాగా నా బతుకంతా ఈ ప్రపంచాన్ని బేలెన్స్ చేయడంతో సరిపోతుంది."

"అయితే ఈ జన్మలో నేను చాలా బట్టల మూటలు మోయాల్సి వస్తుందేమో!" దిగులుగా అంది గాడిద.

"తప్పదు. ఈ జన్మకింతే! ఈమాటల కేం గానీ, నీ కేం కావాలో చెప్పు. మళ్లీ మా మేనమామ వస్తాడు."

గాడిద భక్తిపారవశ్యం నుండి ఇహలోకానికి వచ్చి, వెట్టి చాకిరి గురించి ఆలోచించడం వల్ల భయపడటం మొదలెట్టింది. ఎలాగైనా సుఖపడా లనే కోరిక బలీయమైంది. దాంతో ఓ నిర్ణయానికి వచ్చింది.

"స్వామీ! నా బతుకంతా చాకిరితోనే సరిపోతోంది. బరువులు మోసి మోసి విసుగ్గా ఉంది. ఇంత చేసినా నే నంటే గౌరవం ఎవరికీ లేదు. గాడిద, గాడిద అని వెక్కిరిస్తారు."

"అయితే న న్నేం చేయమంటావు?"

"నన్ను చూసి అందరూ ముచ్చటపడాలి. గౌరవించాలి. అలాంటి ఏర్పాటు చేయకూడదా స్వామీ!"

"నీ కోరిక చాలా విచిత్రంగా ఉంది. గాడిదను ఎవరైనా ఎందుకు గౌరవిస్తారు? నువ్వు మనిషిగా పుట్టినప్పుడే అది సాధ్యం!"

"మనుష లంటే నాకు ఇష్టం లేదు, స్వామీ!"

"అలా అనుకుంటే నీ కోరిక ఎలా తీరుతుంది? మనిషిగా పుట్టడానికి అంగీకరించు. నీ కోసం కొన్ని రిజర్వేషన్లు చేస్తాను."

"రిజర్వేషన్లా? అంటే ఏమిటి స్వామీ?"

"అంటే సూక్ష్మంలో మోక్షం. షార్ట్ కట్ మెథడ్! మెదడుకు శ్రమ కలిగించని విధానం."

"నాకు అర్థం కాలేదు స్వామీ!"


"అర్థమయ్యేలా చెబుతాను విను. ఈ రిజర్వేషన్లనేవి అనాదిగా ఉన్నాయి. వేలకొద్దీ సంవత్సరాలు వేద మంత్రాలు జపిస్తూ నా దర్శనాన్ని కోరే ఋషులకు నేను ఓ పట్టాన కనబడను, కరుణించను. వాళ్ల భక్తికి, ఓర్పుకు పరీక్ష పెట్టి,

వాళ్లు చిక్కి శల్యమై బతుకు మీద రోత కలిగి ప్రాణ త్యాగానికి పాల్పడితే అప్పుడు వారించి మోక్ష మిస్తాను. అదే శబరి, గుహుడు, భక్త నందనారు, కన్నప్ప లాంటి భక్తులు ఎంగిలి పెట్టినా, అజ్ఞానంతో పుక్కిట పట్టిన నీళ్లు అభిషేకం చేసినా, చెప్పుల కాళ్లతో నా మీదున్న పత్రిని పక్కకు తోసినా నేను ఏమీ అనను. వాళ్ల భక్తికి మెచ్చి ఆ ఎంగిలి పళ్లు తిని సంతోషిస్తాను.

"ఇలా గిరిజనులను, హరిజనులను, పేదవారిని కరుణించడ మనే పద్ధతిని పురాణాలలో మేమే ప్రవేశపెట్టాము. వీటినే రిజర్వేషన్లంటారు. ఇవి భారతదేశంలో కలియుగాంతం వరకు కొనసాగి మేధావులకు పిచ్చి పట్టించి, వాళ్లను నిరాశా నిస్పృహలకు గురిచేస్తాయి. అప్పుడు అందరూ ఆలోచించడం, కష్టపడి చదవడం మానేస్తారు. ఆలోచనలు లేని స్థితినే వేదాంతంలో బ్రహ్మానందమనీ, సచ్చిదానందమనీ అంటారు."

గాడిద ఓ క్షణం ఆలోచనలో పడింది. తర్వాత ఓ నిర్ణయానికి వచ్చింది.

"సరే, స్వామీ! నేను మనిషిగా పుడతాను. కానీ పూర్తిగా మనిషిలా బతకడం నా కిష్టం లేదు. నేను మనిషిలానూ ఉండాలి, గాడిద లక్షణాలనూ కలిగి ఉండాలి. నాకు గౌరవం, మర్యాద కావాలి. అప్పుడే నాకు సంతృప్తిగా ఉంటుంది. నా కోరికా తీరుతుంది. నాకే కాదు, నా సంతతికి కూడా ఈ వరాన్ని ఇవ్వండి."




గాడిదలోని నిజాయితీకి భగవంతుడు చలించాడు. వరాన్ని కోరుకోమంటే సిరిసంపదలను కోరలేదు. చాకిరిలోనే బతకడం వలన, సుఖాల స్వరూపం తెలియకపోవడం వలన ఇలాంటి కోరిక కోరింది. పాపం! ఏది ఏమైనా దాని కోరిక తీర్చడం తన ధర్మం. భగవంతుడు గాడిద వైపు సానుభూతితో చూశాడు.

"నీ కోరిక రాబోయే కలియుగంలో తీరుతుంది. పంతొమ్మిదో శతాబ్దపు ఉత్తరార్థంలో మీ జాతి ఉనికి క్రమంగా తగ్గిపోతుంది. మీ చేత బట్టలు మోయించుకునే చాకలి వాళ్ల సంఖ్య తక్కువగా ఉంటుంది. అప్పుడే నువ్వు మనిషిగా పుడతావు. నిజాయితీ గల నువ్వూ, నీ వారసులూ స్టేట్ గవర్నమెంటులో కష్టపడి పనిచేసే గుమాస్తాలుగా, బేంక్ ఆఫీసర్లుగా, నోరు లేని కోడళ్లుగా, కాన్వెంటుకు బండెడు పుస్తకాలు మోసుకెళ్లే పిల్లలుగా జన్మిస్తారు. మీకు గౌరవం, మర్యాద లభిస్తాయి.

"**నిజాయితీ** లేని గాడిదలు రాజకీయ నాయకులుగా, లంచాలు తీసుకునే గుమాస్తాలుగా, అధికారులుగా, పనిచేయకుండా ఎగ్గొట్టి తిరిగే ఉద్యోగస్తులుగా, బూతు సినిమాలు తీసే దర్శక, నిర్మాతలుగా జన్మిస్తాయి. వీళ్లకు సిరిసంపదలతోపాటు ఛీత్కారాలు కూడా లభిస్తాయి. నిజమైన గౌరవం, మర్యాద వీళ్లకు లభించవు. తథాస్తు!"

మనిషిగా పుట్టినప్పుడు కూడా తనకూ, తన సంతతికీ సుఖం ఉండదనే విషయాన్ని గ్రహించని గాడిద గౌరవం, మర్యాద లనే ముళ్ల కిరీటాలను తలుచుకుని మురిసిపోయింది. ఒంట్ర పెట్టకుండా మౌనంగా నమస్కరించింది.

చిన్ని కృష్ణుడు చిద్విలాసంగా నవ్వుకుంటూ కాలి బొటన వేలు నోట్లో పెట్టుకున్నాడు.

వసుదేవుడు యమునా నది వైపు నడిచాడు.

★